క్లుప్తంగా

చౌడేశ్వరి ఆలయానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి మంగళవారం నందవరం గ్రామవాస్తవ్యులు నడిపెన్నగారి పెద్ద బాల సుబ్బరాయుడు, పుల్లమ్మ కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం ఇచ్చారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులు, వేదపండితులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో సన్మానించారు.

వారపు సంతకు వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల: స్థానిక లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో డీఎల్‌డీఓ రాంబాబు వారపు సంతకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో పది మంది డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. సంత మార్కెట్ వేలం దక్కించుకునేందుకు డిపాజిట్‌దారులు పోటీ పడ్డారు. చివరకు వెంకటేష్ అనే వ్యక్తి రూ.6.73 లక్షలకు దక్కించుకున్నాడు. ప్రతి మంగళవారం నిర్వహించే సంతలో వ్యాపారుల నుంచి నిర్ణయించిన ధర ప్రకారమే నగదు వసూలు చేయాలని అధికారులు సూచించారు. ఈఓఆర్డీ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, డిజిటల్ అసిస్టెంట్ విష్ణు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత బేతంచెర్ల జట్టు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమ, మంగళవారాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో బేతంచెర్ల జట్టు విజేతగా నిలిచింది. ప్యాపిలి జట్టు ద్వితీయ, రంగాపురం తృతీయ, ముద్దవరం నాల్గొవ, బుగ్గానిపల్లె 5వ, రంగాపురం 6వ బహుమతి కై వసం చేసుకున్నాయి. దాతల సహకారంతో విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

సంజామల: గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో మంగళవారం పోషణ్ పక్వాడపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమని తెలిపారు. వెయ్యి రోజుల కేర్, రక్తహీనత తదితర అంశాలపై తల్లులుకు వివరించారు.

గౌరవ వేతనాల కోసం ఎంపీటీసీల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

ప్యాపిలి: తమకు చెల్లించాల్సిన గౌరవ వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు మద్దయ్య, రంగన్న, రామానాయుడు డిమాండ్ చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు 20 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు. ఎంపీటీసీలకు రావాల్సిన గ్రాంట్లు..వివిధ సమావేశాలకు హాజరైతే ఇవ్వాల్సిన బత్తా కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి గౌరవ వేతనాలతో పాటు ఇతర గ్రాంట్లను విడుదల చేయాలని కోరారు. ఇందుకు నిరసనగా బుధవారం జరగనున్న మండల సర్వసభ్య సమావేశానికి తాము హాజరుకాకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

అనగనగా ఓ గ్రామం..!

- వందేళ్ల క్రితం కాలగర్భంలో దద్దనాల
- గ్రామం కనుమరుగైనా ఆనవాళ్లు పదిలం
- పురాతన గ్రామానికి సాక్ష్యంగా రచ్చబండ, మారెమ్మ ఆలయం
- ఆచారాలను కొనసాగిస్తున్న ఆ గ్రామ వంశస్తులు
- కనుమరుగైన గ్రామంలో కొత్తగా ఆలయాలు



దద్దనాల ఆరాధ్యదైవం మారెమ్మగుడి



దద్దనాల గ్రామంలో రచ్చబండ



కాశీనాయన ఆశ్రమం

కోవెలకుంట్ల: వందేళ్ల క్రితం గ్రామం కాలగర్భంలో కలిసిపోగా ఈ ప్రాంతంలో ఒక ఊరు ఉండేదనడానికి గుర్తుగా కొన్ని ఆనవాళ్లు చెక్కు చెదరకుండా ఉన్నాయి. శతాబ్ద కాలం నాటి ఆనవాళ్ల ఆ గ్రామ చరిత్రకు అద్దం పడుతున్నాయి. పూర్వీకుల కథనం మేరకు కోవెలకుంట్ల మండలంలోని కలుగొట్లకు అరకిమీ దూరంలో 562 సర్వే నంబర్‌లో 40 సెంట్ల విస్తీర్ణంలో వందేళ్లకు పూర్వం దద్దనాల అనే చిన్న గ్రామం ఉండేది. గ్రామంలో 50 కుటుంబాలు జీవనం సాగించేవారు. గ్రామంలో ఒకే ఒక రెడ్డి కులానికి చెందిన కుటుంబం కాగా మిగిలిన వారిలో బోయ, గాండ్ల కులస్తులు ఉండేవారు. గ్రామానికి ఉన్న 200 ఎకరాల భూముల్లో గ్రామ శివారులో ప్రవహిస్తున్న కుందూనది ఆధారంగా వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేవారు. ఆ కాలంలో పత్తి, రాయచూర్ రకానికి చెందిన జొన్న, వేరుశనగ, తదితర పంటలు ప్రధానంగా పండించేవారు. ఈ గ్రామానికి అరకిమీ దూరంలో ఒకవైపు కలుగొట్ల, అంతే దూరంలో మరోవైపు ఎం.ఉప్పలూరు గ్రామాలు ఉన్నాయి. గ్రామంలో కులవృత్తులకు సంబంధించి రజక, నాయిబ్రాహ్మణ, బ్రాహ్మణ, కుటుంబాలు లేకపోవడంతో పక్కగ్రామాల్లో నివాసం ఉంటున్న కులవృత్తుల కుటుంబాలు దద్దనాల గ్రామస్తులకు కులవృత్తులు చేసేవారు. గ్రామంలో చదువుకునేందుకు ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో విద్య నేర్చుకునేందుకు కలుగొట్ల గ్రామానికి వెళ్లేవారు. గ్రామస్తులు దసరా, ఉగాది పండుగలను ఘనంగా జరుపుకునేవారని ప్రస్తుతం అక్కడ ఉన్న ఆనవాళ్ల ఆధారంగా తెలుస్తోంది. దసరా పండుగ రోజున గ్రామ సమీపంలో ఉన్న జమ్మిచెట్టుపై విల్లంబులు సంధించేవారు. ఉగాది పర్వదినాన మారెమ్మకు బోనాలు సమర్పించి పండుగ చేసుకునేవారు. గ్రామ నడిబొడ్డున ఉన్న దిగుడుబావి గ్రామస్తులకు దాహార్తి తీర్చేది.



గ్రామ నడిబొడ్డున ఇటీవల వెలసిన శివాలయం

దొంగలబెడద, కుందూ వరదలతో గ్రామం ఖాళీ

దద్దనాల గ్రామానికి దొంగలబెడద అధికంగా ఉండడం, కుందూనది వరదల కారణంగా గ్రామం ఖాళీ అయినట్లు పూర్వీకుల చరిత్ర. గ్రామంలో కేవలం 50 కుటుంబాలు ఉండడంతో గ్రామంపై తరుచూ దొంగలు పడేవారు. అప్పట్లో డబ్బులు, ఆభరణాలు పెద్దగా లేకపోయినా దొంగలు కడుపు నింపుకునేందుకు చిన్న గ్రామం కావడంతో అనేక సార్లు దొంగతనాలకు పాల్పడేవారు. రైతులు పండించిన ధాన్యం, బట్టలు, పొట్టేళ్లు తదితర వాటిని అపహరించేవారు. దొంగలబెడద కారణంగా గ్రామస్తులు రాత్రిళ్లు వీధిలో తిరుగుతూ పహారా కాసేవారు. దొంగల బెడదకు తోడు గ్రామ శివారులో ప్రవహిస్తున్న కుందూనది ఉప్పొంగి గ్రామాన్ని, పంట పొలాలను ముంచెత్తుతుండేది. ఈ రెండు ప్రధాన కారణాలకు తోడు గ్రామంలో కులవృత్తులు, సరైన వసతులు లేకపోవడంతో ఒక్కొక్కరుగా గ్రామాన్ని విడిచి పక్క గ్రామాలైన ఉప్పలూరు, కలుగొట్ల గ్రామాల్లో చేరారు. గ్రామంలో సంఖ్యాబలం తగ్గడంతో వందేళ్ల క్రితం గ్రామం ఖాళీ అయింది. కాలానుగుణంగా ఇళ్లు, ప్రహరీలు తదితర కట్టడాలు కాలగర్భంలో కలిసిపోయాయి. గ్రామం ఖాళీ కావడంతో గ్రామానికి చెందిన పొలాన్ని కలుగొట్ల, ఉప్పలూరు గ్రామ రెవెన్యూ రికార్డుల్లో చేర్చారు.

సాక్ష్యంగా రచ్చబండ, మారెమ్మ ఆలయం

వందేళ్ల క్రితం దద్దనాల గ్రామం కనుమరుగు కాగా గ్రామ ఆనవాళ్లుగా రచ్చబండ, మారెమ్మ దేవాలయం, పునాదిరాళ్లు, గోడలు నిలిచాయి. తర్వాతి కాలంలో మారెమ్మ దేవాలయానికి జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. దద్దనాల గ్రామం ఉన్న ప్రాంతంలో రెండేళ్ల క్రితం కాశీనాయన ఆశ్రమం, శ్రీకృష్ణ దేవాలయం, శివాలయం నిర్మించారు. ప్రస్తుతం ఆ ఆలయాల్లో నిత్యపూజలు జరుపుతూ దద్దనాల గ్రామాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

దద్దనాల ఆచారాలను కొనసాగిస్తున్నాం



వందేళ్ల క్రితం దద్దనాల గ్రామం కనుమరుగైనా పండుగ రోజుల్లో ఇప్పటికీ ఆ గ్రామ ఆచారాలను కొనసాగిస్తున్నాం. దసరా పండుగ రోజున జమ్మి చెట్టుకు పూజలు చేయడం, ఉగాది పండుగ సందర్భంగా దద్దనాల పొలమేరలో ఉన్న మారెమ్మ ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహిస్తున్నాం.

–లక్ష్మినారాయణ, కలుగొట్ల, కోవెలకుంట్ల

ఆలయాల నిర్మాణాలతో కొత్త శోభ



దద్దనాల గ్రామం కాలగర్భంలో కలిసి పోగా గ్రామానికి గుర్తుగా రచ్చబండ, మారెమ్మ దేవాలయం ఇప్పటికి ఉన్నాయి. గ్రామం కనుమరుగైన ప్రదేశంలో శ్రీకృష్ణదేవాలయం, శివాలయం, కాశీనాయన ఆశ్రమం నిర్మించారు. ఆలయాల నిర్మాణం, భక్తుల రద్దీతో పురాతన గ్రామం లేకపోయినా ఆ ప్రాంతంలో కొత్తశోభ సంతరించుకుంది.

–భాస్కర్‌రెడ్డి, కలుగొట్ల, కోవెలకుంట్ల

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల: మాదక ద్రవ్యాల వినియోగంతో అనేక అనర్థాలు ఉత్పన్నమవుతాయని.. వాటికి దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనం గడపాలని ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెన్నెడి సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, వాటి దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గంజాయి, కొకైన్, ఇతర మాదకద్రవ్యాలకు బానిసైతే తిరిగి మామూలు మనుషులుగా మార్చడం కష్టతరమన్నారు. ప్రజలు వాటి జోలికి వెళ్లకుండా విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు వాటికి దూరంగా ఉంటేనే భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, క్రిష్ణదాసు, నరేంద్రనాథరెడ్డి, రమణారెడ్డి, సుభాష్‌రెడ్డి, సంటిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ మునిస్వామి పాల్గొన్నారు.

అప్రమత్తతే అగ్నిప్రమాదల నుంచి రక్ష



బనగానపల్లె: కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



డోన్: వాటర్‌గన్‌తో విన్యాసం

బనగానపల్లె రూరల్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె అగ్నిమాపకశాఖ ఫైర్ ఆఫీసర్ ఈశ్వర్‌నాయక్ అన్నారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

- **డోన్ టౌన్:** స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర కూడళ్లలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి రంగస్వామిగౌడ్, ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి



విద్యార్థులు తయారు చేసిన చార్ట్‌లు

డోన్ టౌన్: ఆలోచనలకు రూపమిచ్చి అద్భుతాలను సృష్టించేది కళ అని అలాంటి కళలను ప్రోత్సహించాలని పాతపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ప్రపంచ కళల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులతో డ్రాయింగ్ వేయించిన చార్ట్‌లు, నృత్యాలను ప్రదర్శించారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో ఆటలు, పాటలు, నృత్యాలు, డ్రాయింగ్, తదితర అంశాలను గుర్తించి ప్రోత్సాహించాలన్నారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, వెంకటలక్ష్మీ, బాబు, రాధ తదితరులు పాల్గొన్నారు.



డ్రాయింగ్ మాస్టర్‌ను సత్కరిస్తున్న ఎంఈఓ–2

కళలతో సమాజంలో గుర్తింపు

బేతంచెర్ల: సమాజంలో ప్రతి ఒక్కరికి ఒక కళ ఉంటుందని, దాన్ని గుర్తించి రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని ఎంఈఓ–2 అబ్రహ్మం అన్నారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో వరల్డ్ ఆర్ట్స్ డే సందర్భంగా డ్రాయింగ్ మాస్టర్ జాకీర్ బాషాను ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో సత్కరించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి పథకాల ద్వారా జీవనోపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఆధార్‌కు లింకైన ఫోన్ నంబర్, తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

- **కొలిమిగుండ్ల:** 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి తెలిపారు. మండలానికి 12 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కొలిమిగుండ్ల, పెట్నికోట, అంకిరెడ్డిపల్లె ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లకు మూడు చొప్పున, కొలిమిగుండ్ల స్టేట్ బ్యాంక్‌కు మూడు యూనిట్లు కేటాయించారని చెప్పారు. మే 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్యాపిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖకు సంబంధించి ప్రగతి నివేదికతో సమావేశానికి హాజరుకావాలన్నారు. హాజరుకాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

22న మండల మీట్

అవుకు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంగన్న మంగళవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి మండలస్థాయి అధికారులతో పాటు ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

మట్కా బీటర్ అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తాలో మంగళవారం మట్కాబీటర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కోవెలకుంట్లకు చెందిన మంగలి పుల్లయ్య మట్కాబీట్ నిర్వహిస్తుండగా సమాచారం మేరకు దాడి చేసి అతని వద్ద నుంచి రూ.1400 నగదు, మట్కాచీటీలు స్వాధీనం చేసుకుని బీటర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సంక్షిప్తం

గంగమ్మకు ప్రత్యేక పూజలు

అవుకు: మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు కాటసాని ప్రసాద్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట నాయకులు ఉమ్మడి చిన్నక్రిష్టారెడ్డి, మేకల వెంకటేశ్వర రెడ్డి, కొడితం విక్రమ్, జగదీష్ ఉన్నారు.

పైపులు దగ్ధం

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామంలో రైతు నాగార్జున చౌదరికి చెందిన పొలం గట్టుపైన ఉన్న పైపులు మంగళవారం కాలిపోయాయి. రెండు రోజుల క్రితం రూ. 30 వేల విలువ చేసే రాయితీ పైపులను తీసుకుని పొలం గట్టున ఉంచారు. ప్రమాదవశాత్తు పైపులకు నిప్పు అంటుకుని కాలిపోయాయని బాధిత రైతు లబోదిబోమన్నాడు.

దత్తాత్రేయ శర్మకు ఉగాది పురస్కారం

డోన్ టౌన్: డోన్ బ్రాహ్మణ శ్రీగాయత్రీ పీఠం వ్యవస్థాపకుడు, శతవధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మకు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం ఉగాది పురస్కారాన్ని అందించింది. విశ్వావసునామ సంవత్సరం ఉగాది పురస్కారాల్లో భాగంగా మంగళవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. శ్రీకృష్ణదేవరాయల భువన విజయం నాటక రూపకర్తగా, తెలుగు భాషకు అందించిన సేవకు గుర్తుగా ఈ పురస్కారం అందజేశారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

బేతంచెర్ల: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన కర్నూలు నాగార్జున(41) ఈ నెల 13వ తేదీ మద్యం మత్తులో రసాయన మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించాడు. మృతుని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

కోలుకోలేక యువకుడి మృతి

బనగానపల్లె రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు.. నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన చాకలి శీలయ్య కుమారుడు చాకలి మస్తాన్(23), బంధువు బాలాజీ సోమవారం బైక్‌పై టంగుటూరు గ్రామం నుంచి స్వగ్రామం పలుకూరుకు వస్తుండగా చెరువుపల్లె సమీపంలో ఆటో ఢీకొంది. చాకలి మస్తాన్, బాలాజీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మస్తాన్ మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వెల్లడించారు.

వక్ఫ్ సవరణ చట్టంపై నిరసన



బనగానపల్లె కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లిం అడ్వకేట్ ఫోరం



డోన్‌లో మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ నాయకులు

బనగానపల్లె రూరల్: వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ముస్లిం లా బోర్డు పిలుపు మేరకు బనగానపల్లె కోర్టు వద్ద ముస్లిం అడ్వకేట్ ఫోరం సభ్యులు మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక కోర్టు నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ముస్లింల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని మండిపడ్డారు. వక్ఫ్ బోర్డులో జోక్యం చేసుకోవడం తగదన్నారు. ఈ చట్ట సవరణతో వక్ఫ్ బోర్డుకు చెందిన స్థలాలు అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమిలో భాగస్వామి అయిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముస్లింలకు అన్యాయం చేశారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ నారాయణరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అబ్దుల్‌ఖైర్, ఆదిల్ సాహెబ్, ఖాజాహుస్సేన్, జాకీర్, ఇర్ఫాన్, ముజాహిర్, వహీద్, రఫీ, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

- **డోన్ టౌన్:** వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డోన్ ఆవాజ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జలదుర్గం రసూల్, ఎస్ఏ చిన్నరహిమాన్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్ట సవరణకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. ఆవాజ్ కమిటీ నాయకులు బీరువాల సలాం, అక్బర్ బాషా, హుస్సేన్‌బాషా, నూర్‌బాషా, మహబూబ్, అయేషా, ఖాజా, రఫీ పాల్గొన్నారు.

గజవాహనంపై చెన్నకేశవుని విహారం



గజవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారు మంగళవారం గజవాహనంపై విహరించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన గజవాహనంపై స్వామివారిని ఆశీనులను చేశారు. ఆలయం నుంచి నీళ్ల ట్యాంకు, కొత్తబస్టాండ్, భాస్కర్‌రెడ్డి సంధు, సీసీఎస్, రాంపుల్లయ్య, పాతబస్టాండ్ వరకు స్వామివారికి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్ సుజాత శర్మ, శ్రీధర్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



వెలుగు కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న వీఓఏలు, సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల: మండలంలో అక్రమంగా తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ మండల నాయకుడు వెంకటరమణ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి వెలుగు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెలుగు కార్యాలయంలోని సిబ్బందిని బయటకు పంపించి తాళం వేసి నిరసన తెలిపారు. వీఓఏల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడారు. గ్రామాల్లో పనిచేస్తున్న వీఓఏలను గ్రామైక్య తీర్మాణం లేకుండా ఏపీఎం ఇష్టారాజ్యంగా తొలగించాలని దుయ్యబట్టారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

నిర్లక్ష్యపు నీడలో ‘ఉపాధి’

- అరకొర మందికే పనులు
- పనుల్లేక కూలీల అవస్థలు



కోవెలకుంట్ల శివారులో ఉపాధి పనులు చేస్తున్న అరకొర కూలీలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్లక్ష్యం వెంటాడుతోంది. అడిగిన వారందరికీ పనులు కల్పించడంలో అధికారులు అలసత్వం వహిస్తుండడం కూలీలకు శాపంగా మారింది. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగలక్ష్మి రాజకీయ కారణాలతో ఇటీవల రాజీనామా చేశారు. ఆమె రాజీనామాతో వారం రోజుల పాటు ఉపాధి పనులు నిలిచిపోయాయి. పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్, స్వామినగర్, సంతపేట, శ్రీరాంనగర్, సాయినగర్, తదితర కాలనీలకు చెందిన 1800 మందికి ఉపాధి పనులు కల్పించాల్సి ఉంది. వేసవికాలం కావడం.. వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ఉపాధి పనులపై ఆసక్తి చూపుతున్నారు. కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించే వరకు ఉపాధి పథక సిబ్బంది పర్యవేక్షణలో పనులు కొనసాగించాల్సి ఉంది. కొత్త ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం జాప్యమవుతుండడంతో ఉపాధి పథక టెక్నికల్ అసిస్టెంట్ పర్యవేక్షణలో ఇటీవల పనులను పునఃప్రారంభించారు. అయితే కొంత మందికి మాత్రమే పనులు కల్పించడంతో మిగిలిన కూలీలు ఆందోళన చెందుతున్నారు. వారం నుంచి 50 మందిలోపు కూలీలు మాత్రమే పనులకు వెళుతున్నారు. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన వందలాది మంది కూలీలు ప్రతి రోజు ఉపాధి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పనులు లేకపోవడంతో వారంతా ఇళ్ల వద్ద ఖాళీగా ఉంటున్నారు. పనులు చేస్తే కాని పూట గడవని కుటుంబాలు వందల సంఖ్యలో ఉండగా పనులు లేక కూలీలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఉపాధి పథకం కింద అడిగిన వారందరికీ పనులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.